సాక్షి ఆదిలాబాద్

శనివారం : 7 : జూన్ : 2025



బాసరలో భక్తుల సందడి

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం భక్తులతో సందడిగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

10లో▸



వంతెన పనులు పూర్తయ్యేదెప్పుడో?

భోరజ్ సమీపంలో తర్నం వద్ద చేపట్టాల్సిన వంతెన పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. తాత్కాలిక వంతెన చిన్నపాటి వర్షానికే మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

11లో▸

గరిష్టం/కనిష్టం
37.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కైలాస్‌నగర్: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మహిళ వైద్యులతో మహిళా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మెడిసిన్ అందజేశారు. కార్యక్రమంలో డీఎంవో శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మెప్మా డీఎంసీ శ్రీనివాస్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, ఎస్ఈ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని జీఎస్ ఎస్టేట్‌లో గల వివాదాస్పద రోడ్డు స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ జేఆర్ చౌహాన్ శుక్రవారం పరిశీలించారు. కొంతమంది రియల్ వ్యాపారులు రోడ్డు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించారంటూ పలువురు ఇటీవల కలెక్టర్ రాజర్షి షాను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి కమిషనర్ ఆ స్థలాన్ని పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీపీవో సుమలత, డీపీబీవో సాయికృష్ణ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

జైనథ్: గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని దీపాయిగూడ గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న శ్రీ రాముల కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ చేశారు. మాకోడ, ఆకుర్ల గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్‌రెడ్డి, నాయకులు రాకేశ్‌రెడ్డి, అశోక్ రెడ్డి, విశాల్, విజయ్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: మహాలక్ష్మి బోనాల పండుగ పురస్కరించుకుని మండలంలోని బరాపూర్ గ్రామంలో శుక్రవారం బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై బోనమెత్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కేదరేశ్వర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, కన్వీనర్ వెంకటేష్,పాల్గొన్నారు.




నెత్తిన బోనంతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

9 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: డీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 9 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. జూన్ 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ర్యాంక్ కార్డు, హాల్‌టికెట్, బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. వివరాల కోసం డీసెట్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఈ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ సర్వీసులను వెంటనే రిలీజ్ చేయాలని ఏఈలను విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో సర్కిల్‌లోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిష్ కేబుల్, ఇంటర్నెట్ కేబుల్ వాడుతున్న ఆపరేటర్లు పోల్స్‌ను లెక్కించి చార్జీలు చెల్లించేలా చూడాలని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులను వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు.

అడెల్లు..అమర్‌రహే!



అడెల్లు సోదరుడి ఇంటివద్ద గుమిగూడిన గ్రామస్తులు

మైలారపు అడెల్లు (ఫైల్)

- ముగిసిన ఉద్యమ ప్రస్థానం
- బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో 'మైలారపు' మృతి
- మూడు దశాబ్దాలుగా అరణ్యంలోనే..
- విషాదంలో పొచ్చెర గ్రామం
- మృతదేహం అప్పగించాలంటున్న కుటుంబీకులు, గ్రామస్తులు

బోథ్: మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. మూడు దశాబ్దాల ఉద్యమ కెరటం నింగికెగిసింది. నూనుగు మీసాల ప్రాయంలో అడవిబాట పట్టి విప్లవోద్యమంలో అంచెలంచెలుగా ఎదిగిన ఆ గొంతుశాశ్వతంగా మూగబోయింది. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల డివిజన్ ఇన్‌చార్జి మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్(53) ప్రస్థానం ముగిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా నేషనల్‌పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అడెల్లు మృతి చెందాడు. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఆయన తుదిశ్వాస విడిచారు. బాల్యం నుంచి అభ్యుదయ భావాలు కలిగిన అడెల్లు మరణవార్త జిల్లాలోని పొచ్చెర గ్రామాన్ని తీవ్రంగా కలిచివేసింది. 30 ఏళ్ల క్రితం జ్ఞాపకాలను ఆ ఊరు గుర్తు చేసుకుంది.

అడెల్లు ప్రస్థానం ఇదీ..

అడెల్లు స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామం. తల్లిదండ్రులు పోతన్న–పోషవ్వకు నలుగురు సంతానం. పెద్ద అడెల్లు, సీతారాం, అడెల్లు, చిన్న అడెల్లు. తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. దున్నే వాడిదే భూమి నినాదం, పేదరికం అడెల్లును నక్సల్ వైపు నడిపించింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయనను 1989లో జరిగిన భూపోరాటం ఆకర్షించింది. అడెల్లు చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు, సోదరులతో కలిసి కూలి పనులకు వెళ్తుండేవాడు. భూస్వాముల పెత్తందారితనాన్ని తరచూ ప్రశ్నించేవాడు.

విద్యాభ్యాసం..

బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. 1989లో నిర్మల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. నిర్మల్‌లో డిగ్రీ చదువుతున్న రోజుల్లో విప్లవ సిద్ధాంతాలకు ఆకర్షితుడై రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరాడు.

రాడికల్ నుంచి దళంలోకి..

రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చురుగ్గా పాల్గొనేవాడు. అధ్యక్షుడిగా పనిచేశాడు. గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచాడు. ఈ క్రమంలోనే 1995 ప్రాంతంలో నక్సలైటుగా మారాడు. దళంలోకి ప్రవేశించాడు. మొదట బోథ్ దళ సభ్యుడిగా పని చేసిన ఆయన ఇంద్రవెల్లి డిప్యూటీ కమాండర్ స్థాయికి ఎదిగాడు. అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి వెళ్లాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై పూర్తిస్థాయి పట్టు సాధించాడు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల డివిజన్ కమిటీకి సారథ్యం వహిస్తూ.. కరోనా సమయంలో ఉమ్మడి జిల్లాలో రిక్రూట్‌మెంట్ బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. గతంలో అడెల్లు దళాన్ని పట్టుకోవడమే లక్ష్యంగా పోలీస్ బలగాలు ఉమ్మడి జిల్లాలోని తిర్యాణి, మంగి, బోథ్, పెంబి, ఖానాపూర్, మామడ ప్రాంతాల్లో జల్లెడ పట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. పలుమార్లు చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నట్లు వినికిడి. 2020 సెప్టెంబర్ 19న కదంబ అడవుల్లో పోలీసులు, మావోయిస్టులకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో అడెల్లు తృటిలో తప్పించుకున్నాడు. ప్రస్తుతం అడెల్లుపై రూ. 25 లక్షల రివార్డు ఉంది.

కంతి లింగవ్వతో వివాహం..

అడెల్లు దళంలో చేరిన సందర్భంలోనే అప్పటికే అందులో కొనసాగుతున్న నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన కంతి లింగవ్వతో వివాహం జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు కీలక సభ్యులుగా ఎదిగారు. లింగవ్వ జిల్లా కమిటీ సభ్యురాలిగా ప్రధాన భూమిక పోషించారు. మంగీ ప్రాంతంలో రిక్రూట్‌మెంట్ చేసినట్లు తెలుస్తోంది. 2022 డిసెంబర్‌లో లింగవ్వ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. అప్పటి నుంచి అడెల్లు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి వెళ్లారని తెలుస్తోంది.

ఎట్లున్నడో అనుకునేలోపే..

కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ఏరివేయాలని వారికి పట్టున్న అడవుల్లో కూంబింగ్ షురూ చేసింది. ఎన్‌కౌంటర్లలో వందల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందిన తరుణంలో మైలా రపు అడెల్లు ఎక్కడున్నాడో.. ఎలా ఉన్నాడోనని కుటుంబీకులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ఆయన మరణ వార్త వారి గుండెను చెరువు చేసింది. చివరి చూపు కోసం మృతదేహాన్ని అప్పగించాలని కుటుంబీకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

చివరి చూపు చూడాలని ఉంది



నా తమ్ముడు అడెల్లును చివరి చూపు చూడాలని ఉంది. చిన్నతనంలో దళంలోకి వెళ్లాడు. ప్రజల కోసమే పని చేశాడు. ఇంతకాలం ఎక్కడున్నా బతికే ఉన్నాడనే ఆశ ఉండేది. ఇప్పటికి దాదాపు 30 ఏళ్ల దాటింది చూసి. మృతదేహాన్ని అప్పగించాలని కోరుతున్నా.

– మైలారపు సీతారం, అడెల్లు సోదరుడు, పొచ్చెర


విచారణ జరగాలి



అడెల్లును పట్టుకుని కాల్చి చంపారని అనుమానం ఉంది. కగార్ పేరుతో నక్సలైట్లను కాల్చడం దారుణం. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరగాలి. ఆయన మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించాలి.

– బి.రమణయ్య, పొచ్చెర గ్రామం

మంచి చేయాలన్న తపన ఉండేది



చిన్నప్పటి నుంచి అడెల్లుకు మంచి చేయాలన్న తపన ఉండేది. పేదల పట్ల సేవాగుణం చూపుతూ అందరితో కలివిడిగా ఉండేవాడు. బాగా చదువుకునేవాడు. అడెల్లు ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం జీర్ణించుకోలేకపోతున్నాం.

– నడికుంట నడిపి అడెల్లు, గ్రామస్తుడు

మైక్రోఫైనాన్స్‌లపై తప్పుడు ప్రచారం సరికాదు

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: స్వార్థంతోనే కొంతమంది వడ్డీవ్యాపారులు, దళారులు మైక్రోఫైనాన్స్ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆర్బీఐ గుర్తించిన మైక్రోఫైనాన్స్ ఇండస్ట్రీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆర్థిక అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేనటువంటి మారుమూల, పట్టణ ప్రాంతాల్లో, బ్యాంకు సేవలు పొందలేనటువంటి వారికి ప్రయోజనం కల్పించేందుకే మైక్రోఫైనాన్స్ సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ఎలాంటి తాకట్టు, కండిషన్ లేకుండా వారిచ్చే రుణలతో తమ వ్యాపారాలకు నష్టం కలుగుతుందనే ఉద్దేశంతో వడ్డీ వ్యాపారులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారమే రుణాలు ఇవ్వాలని, వాటిని చెల్లించే విధానంపై ముందుగానే వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఉత్పల్ కుమార్, ఎంఎఫ్ఐఎన్ నెట్‌వర్క్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ప్రణాళికతోనే సీజనల్ వ్యాధుల కట్టడి

సీజనల్ వ్యాధుల కట్టడికి పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సీజనల్ వ్యాధుల సంసిద్ధతపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, విషజ్వరాల బారిన పడకుండా పా టించాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ముందస్తు వైద్య శిబి రాలు నిర్వహించాలన్నారు. వైద్యులు, సిబ్బంది ప్ర జలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. హైరిస్క్ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి, డీపీవో రమేశ్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గుడిహత్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య సాధ్యపడుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలన్నారు. అంతకు ముందు జైనథ్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిందం ఆశన్న రచించిన బడిబాట పాటను విడుదల చేశారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో ఉదయ్‌రావు, ఎంపీడీవో అబ్దుల్ హై, ప్రధానోపాధ్యాయుడు సంతోష్ కుమార్, సెక్టోరియల్ అధికారి సుజాత్‌ఖాన్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ పూజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే భూభారతి

భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి కార్యక్రమం చేపట్టిందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని ధంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో పారదర్శకత, సమర్థత, వేగం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. రైతుల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ భాగ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో మూడు ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లు

కైలాస్‌నగర్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించేలా జిల్లాలోని ఇచ్చోడ, ఉట్నూర్, జైనథ్ మండలాల్లో ప్లా స్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వచ్ఛ భారత్ మిషన్, అమ్మ ఆదర్శ పాఠశాల, వన మహోత్సవ నిర్వహణపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను కూలీల ద్వారా సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఏడాది 46.57 లక్షల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనుల రికార్డుల నమోదు సక్రమంగా జరగలేదని మరోసారి చేపట్టాలని సూచించారు.ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంతో 'ఉపాధి'

- జిల్లాకు 560 ఎకరాల సాగు లక్ష్యం
- రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మూడేళ్ల వరకు ప్రభుత్వానిదే సంరక్షణ



తాంసిలో సాగవుతున్న జామ తోట (ఫైల్)

కైలాస్‌నగర్: జిల్లాలో రైతులు పత్తి, సోయా, కంది వంటి సంప్రదాయ పంటలనే సాగు చేస్తున్నారు. అయితే వాటి దిగుబడులు ఆశించిన స్థాయిలో రాక పలువురు నష్టపోతున్నారు. ఈ క్రమంలో పండ్ల తోటల పంపెకం ద్వారా రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా పండ్ల ఉత్పత్తి జరగకపోవడంతో భారీగా ధర పలుకుతున్నాయి.ఈ క్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం అన్నదాతకు ఆర్థిక చేయూత అందిస్తూ అండగా నిలుస్తోంది. రైతు నయాపైసా ఖర్చు లేకుండా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టే అవకాశం కల్పిస్తుంది. జిల్లాలో ఈ సీజన్‌కు 560 ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

సాగుకు ప్రభుత్వ చేయూత ..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో 560 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలను పెంచేదిశగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఎకరం నుంచి మూడు ఎకరాల వరకు పండ్ల తోటల సాగుకు ప్రోత్సహిస్తుంది. ఎకరాకు 70 నుంచి 160 మొక్కల చొప్పున రైతులకు అందించనున్నారు. ప్రధానంగా మామిడి, నిమ్మ, జామ, బత్తాయి, తైవాన్ జామ, మునగ, సీతాఫలం, సపోట, డ్రాగన్ ఫ్రూట్స్ , కొబ్బరి తోటల పెంపకం చేపట్టేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం జిల్లాలోని ఆసక్తి గల రైతుల నుంచి ఎంపీడీవోల ద్వారా అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎంపీడీవోల నుంచి అందిన దరఖాస్తుల ఆధారంగా మొక్కలు అందించేలా చర్యలు చేపట్టనున్నారు.

సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

పండ్ల తోటల పెంపకానికి సంబంధించి మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తవ్వేందుకు రూ.233.32, మొక్కలు నాటేందుకు రూ.47.53 జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తోంది. అలాగే ఆ మొక్కలు ఎదిగేలా నీటిని అందించేందుకు సైతం ఆర్థిక చేయూతనందిస్తుంది. రైతులు చేపట్టిన ఈ పండ్ల తోటలకు సంబంధించి ఒక ఎకరాకు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే సంరక్షణ బాధ్యతలను పర్యవేక్షిస్తూ రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. అయిదెకరాల్లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ , చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. సదరు రైతులు సాగునీటి వసతి కలిగి ఉండాలి. నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసిన డీఆర్డీఏ అధికారులు వ్యవసాయ, ఉద్యానవనశాఖల సమన్వయంతో దాన్ని అధిగమించేలా ముందుకు సాగుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పండ్ల తోటల పెంపకాన్ని పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో రైతులకు ఆర్థికచేయూత అందిస్తుంది. నీటి వసతి కలిగి జాబ్ కార్డు కలిగిన రైతులు ఎంపీడీవోలకు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో మామిడి, నిమ్మ, జామ, మునగ మొక్కలకే ప్రధాన డిమాండ్ ఉంది. వాటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. వీటితో పాటు ఇతర మొక్కలు నాటేందుకు ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకుంటే వాటిని కూడా అందజేస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి.

– కుటుంబరావు, అడిషనల్ డీఆర్డీవో

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు సిబ్బంది నిజాయతీ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు రికార్డులను నవీకరిస్తూ పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. పోలీసు యంత్రాంగానికి స్పెషల్ బ్రాంచ్ నిఘా వ్యవస్థలా పనిచేస్తుందని తెలిపారు. అనునిత్యం ప్రజలతో కలిసి ఉంటూ సమాచారాన్ని సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీసీఆర్‌బీ డీఎస్పీ నాగేందర్, ఇన్‌స్పెక్టర్లు మోహన్, సునిల్ కుమార్, కరుణాకర్ రావు, వెంకటి, ఎస్సై అన్వర్ ఉల్‌హఖ్, ఏఎస్సై సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.




ఎస్‌బీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్‌లో నమోదు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బాధితులు పోగొట్టుకున్న రూ.13లక్షల విలువ గల వంద మొబైల్ ఫోన్లను స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బాధితులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి రాబట్టడం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 రోజుల్లోనే వంద ఫోన్లను స్వాధీనం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 800 ఫోన్లు బాధితులకు అందించినట్లు వివరించారు. దొంగలించిన, పోగొట్టుకున్న ఫోన్‌లను తిరిగి పొందేందుకు బాధితులు www.ceir.gov.in వెబ్‌సైట్‌తో పాటు సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు సునిల్ కుమార్, కరుణాకర్‌రావు, ఫణిందర్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ వెంకటి, ప్రత్యేక బృందాల సభ్యులు గోపీకృష్ణ, సంజీవ్, మజీద్, త్రిశూల్, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో నమ్మకం పెంచేందుకు ఫ్లాగ్‌మార్చ్..

ఆదిలాబాద్‌టౌన్: ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంపొందించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బక్రీద్ సందర్భంగా 300 మంది పోలీసు సిబ్బందితో శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. శాంతినగర్, బొక్కల్‌గూడ, మహాలక్ష్మివాడ, క్రాంతినగర్, ఖానాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. అన్నివర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సునిల్ కుమార్, కరుణాకర్‌రావు తదితరులు ఉన్నారు.



పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

ఆదిలాబాద్‌టౌన్: తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పిల్లలంతా ఒకేచోట చదువుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆయన చేపట్టిన ప్రచారజాత శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఇందుకోసం ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో పౌరస్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యామ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్, సూర్యకుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

అంతరాలు లేని విద్యావిధానం రావాలి

నేరడిగొండ/ఇచ్చోడ: అంతరాలు లేని విద్యావిధానం రావాలని నర్సిరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యపర్చాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రచారజాతా శుక్రవారం నేరడిగొండ, ఇచ్చోడ మండల కేంద్రాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లడారు. ఇందులో టీఎస్ యూటీఎఫ్ నేరడిగొండ మండల అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్, కోశాధికారి ఉదయకిరణ్, ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్ఎం అంబారావు, ఈశ్వర్, చంద్రశేఖర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోలిండియా అసిస్టెంట్ మేనేజర్‌గా ఎంపిక


పవన్‌కల్యాణ్

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన వేల్పుల పవన్‌కల్యాణ్ కోలిండియా అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈయన టెన్త్ వరకు తాళ్లపేట ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీలో ఐఐటీ పూర్తిచేసి, కోలిండియా అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగం సాధించాడు. దీంతో కుటుంబీకులు, గ్రామస్తులు అతన్ని అభినందించారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

మందమర్రిరూరల్: సైబర్ వలలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మోసపోయి రూ.2.30 లక్షల పోగొట్టుకుంది. ఈమేరకు మందమర్రి పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్న పట్టణానికి చెందిన యువతి గత కొంతకాలంగా సెలవుల్లో ఉండగా వర్క్ ఫ్రం హోం కోసం సోషల్‌మీడియాలో వెతుకుతుండగా సైబర్ నేరస్తులు పరిచయమయ్యారు. తక్కువకాలంలో టాస్కులు చేయడం వల్ల ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునని నమ్మబలికారు. ముందుగా కొంతడబ్బులు ఆశచూపారు. తర్వాత ప్రీపెయిడ్ టాస్కుల పేరిట ఆ యువతి వద్ద నుంచి రూ.2.30 లక్షలు పోగొట్టుకుంది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన చిన్నారిని అప్పగింత


అప్పగిస్తున్న పోలీసులు

మందమర్రిరూరల్: తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని మొదటిజోన్ సీఎస్ఐ చర్చికి సమీపంలోని మూడేళ్ల చిన్నారి ఆరాధ్య శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి తప్పిపోయింది. స్థానిక సాయిబాబా ఆలయం వద్ద ఆ చిన్నారి అక్కడివారికి కనిపించింది. వారు బ్లాకోట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రచారం చేయడంతో తల్లిదండ్రులు జమున–రాజులు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా చిన్నారిని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

గోండి వికీపీడీయన్‌కు అరుదైన అవకాశం


వరప్రసాద్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని మత్తడి శంభుగూడకు చెందిన గోండి వికీపీడీయన్ సిడాం వరప్రసాద్‌కు అరుదైన అవకాశం దక్కింది. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ ద్వారా ప్రచురించిన గ్రంథం తిరుక్కురల్‌ను గోండి భాషలోకి అనువదించడానికి అధికారిక ఆమోదం పొందారు. ఆయన ఇప్పటికే 250 ద్విపదల అనువాదాన్ని 25 అధ్యాయలు కేవలం 15 రోజుల్లో పూర్తి చేశారు. తిరుక్కురల్, ఆదిలాబాద్ మాండలికం గోండి లిపిలో రాబోతున్న సందర్భంగా వరప్రసాద్‌ను బోలి చేతో ఫౌండేషన్ సీఈవో సాయికిరణ్, సభ్యులు ఆత్రం మోతీరాం, ఆత్రం రాజ్‌కుమార్, మడావి రవి సన్మానించారు.






బాసరలో భక్తుల సందడి

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. సుదూర ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవారిని దర్శనం కోసం బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అర్చకులతో అక్షరాభ్యాసం చేయించారు. భక్తులు వివిధ అర్జిత సేవ టికెట్ల ద్వారా ఆలయానికి రూ.14 లక్షల భారీ ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

రైతుకు సహకారం

- ఆర్థిక బలోపేతానికి కేంద్రం చర్యలు
- ఉమ్మడి జిల్లాలో ఎఫ్‌పీవోలుగా 43 సొసైటీల ఎంపిక
- సాంకేతిక పరిజ్ఞానంతో మూడేళ్ల నిర్వహణ
- స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాల అభివృద్ధి

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	సొసైటీలు	ఎఫ్‌పీవో ఎంపిక
ఆదిలాబాద్	28	15
మంచిర్యాల	20	12
నిర్మల్	17	08
కుమురంభీం	12	08
మొత్తం	77	43


ఎఫ్‌పీవోలుగా ఎంపికైన మందమర్రి పీఏసీఎస్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో చిన్న, సన్నకారు రైతులను మరింత ఆర్థిక బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతుల ఆదాయం పెంపు, పెట్టుబడి రాయితీలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహార మందులు, వ్యవసాయ యంత్రాల కొనుగోళ్ల కోసం తక్కువ వడ్డీకి రుణాలు అందజేయడం, పంటల ఉత్పత్తుల శుద్ధి, గిట్టుబాటు ధర కల్పించేలా మార్కెట్ అనుసంధానానికి ఎఫ్‌పీవోలు కృషి చేయనున్నాయి. ఎఫ్‌పీవోలుగా ఎంపికైన స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. ఎఫ్‌పీవోలో రైతు చేరితే వ్యవసాయం, అనుబంధ రంగాలు పాడి, మెడికల్‌షాపులు, ఫంక్షన్‌హాళ్లు, పాలు విక్రయాలు, తదితర వ్యాపారాలు స్థానికంగా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధికి సహకారం అందించనుంది.

గుర్తించిన పీఏసీఎస్‌లకే ఎఫ్‌పీవోల హోదా

వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ యంత్రాల కొనుగోలు కోసం దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, సేంద్రియ విత్తనాలు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ చేయడం, పెట్రోల్ బంక్‌లు, రైస్‌మిల్లులు, ఇతర వ్యాపార లావాదేవీలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ప్రాథమిక సహకార సంఘాలను గుర్తించారు. వాటిని మాత్రమే రైతు ఉత్పత్తి సంఘాలు ఎఫ్‌పీవోల హోదా లభించింది. ఇవి ఆర్థికంగా మరింత బలోపేతం కానున్నాయి. స్థానికంగా డిమాండ్ ఉన్న వ్యాపారుల పెట్టుబడికి సహకారం అందించనుంది. ఎఫ్‌పీవోల యాజమాన్య బోర్డుల్లో మహిళా రైతులకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన సంఘాల సభ్యుల నుంచి సభ్యత్వ నమోదు, వ్యాపార ప్రణాళికల తయారు, వాటి అమల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి, కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా అవసరమైన శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులకు శిక్షణ కోసం వరంగల్‌కు చెందిన కాకతీయ సహకార యూనివర్సిటీ ప్రిన్సిపాల్ లాకవత్ యాకుబ్ నాయక్ అందించనున్నారు. రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడానికి, వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడానికి రైతులకు సాంకేతిక పరిచయం చేయడం, మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వ రైతులు ఉత్పత్తిదారులు సంస్థలను ఏర్పాటు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 77 సొసైటీలు ఉండగా సమర్థంగా నడుస్తున్న సొసైటీల్లో తొలి విడతలో 43 ఎంపికయ్యాయి. ఎంపిక చేసిన సొసైటీల్లో 300 నుంచి 750 మంది సభ్యుల వరకు సభ్యత్వం తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో రైతు రూ.2 వేలు చెల్లిస్తే రైతుల వాటా రూ.15 లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఈక్విటీ గ్రాంట్ కింద పెట్టుబడికి రూ.15 లక్షల ఆర్థికసాయం అందించనుంది. దీంతోపాటు మూడేళ్లపాటు కార్యాలయ నిర్వహణ కోసం సీవో, అకౌంటెంట్, సిబ్బందికి ఆరు నెలలకు రూ.3 లక్షల చొప్పున అందజేయనుంది.

వ్యాపారాల్లో ఆర్థికాభివృద్ధి చెందాలి



ఉమ్మడి జిల్లాలో పీఏసీఎస్‌ల్లో తొలివిడతలో 43 సొసైటీలను ఎఫ్‌పీవోలుగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఎంపికగా చేశాం. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. రైతుల నుంచి సభ్యత్వం నమోదు చేసుకుని కేంద్ర ప్రభుత్వం అందించే నిధులు సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగాల్లో ఆర్థికాభివృద్ధి చెందాల్సి ఉంటుంది. స్థానిక వ్యాపారాల కోసం ప్రణాళిక రూపొందించి దానికి అనుగుణంగా కార్యచరణ చేపడుతాం. సభ్యత్వ నమోదు అనంతరం సభ్యులకు శిక్షణ అందిస్తాం.

– లకావత్ యాకుబ్ నాయక్, కాకతీయ సహకార యూనివర్సిటీ ప్రిన్సిపాల్

నైపుణ్యాలతో బోధన ప్రమాణాలు మెరుగు


డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీతో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: కమ్యూనికేషన్ నైపుణ్యాలు బోధన ప్రమాణాలు మెరుగుపర్చడంలో కీలకమని ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్'అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఫ్యాకల్టీలు తమ ప్రొఫెషనల్ అభివృద్ధికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం బోధనలో నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడేలా ఉంటుందన్నారు. కార్యక్రమ సమన్వయకులుగా హెచ్‌ఓడీ విజయ్ కుమార్ అప్పింగర్, అసోసియేట్ డీన్లు విఠల్, మహేశ్, నాగరాజు, పీఆర్వో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక కోసం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆరు టీంల మధ్య జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల నుంచి 11 మందిని ఎంపిక చేసేందుకు జిల్లాకేంద్రంలోని ఉషోదయ స్కూల్ మైదానంలో గురు, శుక్రవారాల్లో గ్రీన్, బ్లూ టీంల మధ్య రెండు ఇన్నింగ్స్‌ల మ్యాచ్‌లు నిర్వహించారు. గ్రీన్ టీం మొదటి ఇన్నింగ్స్‌లో 89 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 274 పరుగులు చేసింది. ఈ టీంకు చెందిన వి. లక్ష్మణ్ 8 ఓవర్లలో నాలుగు వికెట్లు తీశాడు. ఆ తర్వాత బ్లూ టీం మొదటి ఇన్నింగ్స్‌లో 149 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 220 పరుగులు చేసి గ్రీన్ టీంపై 1 వికెట్‌తో విజయం సాధించినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు. బ్లూ టీంలో వి.సింహాద్రి 51 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరో రెండు రోజులు జరిగే ఎంపిక పోటీల్లో గెలుపొందిన టీంల నుంచి 11 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు కోచ్ తెలిపారు.

ఘర్షణలు సృష్టిస్తున్న వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి) గ్రామంలో ఈనెల 3న రెండు మతాల మధ్య ఘర్షణ వాతావరణం, గొడవలు సృష్టించేలా వ్యవహరించిన కెస్గరి రాహుల్‌పై కేసు నమో దు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఇ.సాయన్న శుక్రవారం విలేకరులకు తెలిపా రు. గ్రామానికి చెందిన కెస్గరి రాహుల్‌పై కమ్యూనల్ సస్‌పెక్ట్ షీట్ ఓపెన్ చేశామని పేర్కొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

లక్సెట్టిపేట: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలు మృతిచెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నానికి చెందిన శంకరవ్వ (69) ఈనెల 4న శుభకార్యం కోసం మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లిలో బంధువుల ఇంటికి వచ్చి సాయంత్రం బయల్దేరింది. శుక్రవారం ఉదయం గంపలపల్లి శివారు సమీపంలోని బావిలో శవమై కనిపించింది. మృతదేహం శంకరవ్వది గుర్తించారు. మృతురాలి కూతుర్ని మంగవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

- పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ


మాట్లాడుతున్న పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ

ఆదిలాబాద్‌టౌన్: వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య అటవీ సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ అన్నారు. బాసర జోన్ పరిధిలోని ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల అటవీ శాఖ అధికారులతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన మహోత్సవానికి సంబంధించి లక్ష్యాలను సాధించాలన్నారు. 46 లక్షల మొక్కలు నాటే లక్ష్యం పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఎవరైనా కొత్తగా పోడు కోసం అటవీ భూములు సాగు చేస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మావల హరితవనం పార్కు, కుంటాల జలపాతాల్లో సఫారీలను ఏర్పాటు చేస్తామన్నారు. వాటి అభివృద్ధి కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల డీఎఫ్‌ఓలు ప్రశాంత్ బాజీరావు పాటిల్, వికాస్ మీనన్, నాగిబాను, రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీలకు ఐటీడీఏ ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని 25 పీవీటీజీ గ్రామాలకు మంజూరైన పీఎం జన్‌మన్ పథకం ద్వారా 25 వన్‌దన్ వికాస్ (వీడీవీకే) కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, వీడీవీకేల అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మినీ దాల్‌మిల్, పచ్చళ్లు, పౌల్ట్రీ ఫార్మ్, పేపర్ ప్లేట్, ఇప్ప పరక నూనె, వెదురు కర్ర తయారీ కేంద్రాలకు కావల్సిన పరికరాలు, మిషనరీలు వాటికి కావల్సిన మెటీరియల్ గురించి చర్చించారు. అదేవిధంగా మిషనరీలు, పరికరాలు కొనుగోలు కోసం టెండర్ ప్రక్రియ త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయ డీడీ దిలీప్‌కుమార్, ఎస్ఎంఎం ట్రికార్ లక్ష్మి ప్రసాద్, సాయిచరణ్, ఆర్ఎం ట్రైఫెడ్ సందీప్‌శర్మ, డీపీవో ప్రవీణ్, జేఎస్ఎస్, వీడీవీకే సభ్యులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నాబార్డు సంస్థ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో ప్లంబింగ్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఉచితంగా మూడు నెలల శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనేవారికి ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టేషనరీ, శిక్షణ సామగ్రి అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం న్యాక్ నుంచి సర్టిఫికేట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు ఆయా ప్రైవేట్ సంస్థల్లో ఉద్యో గ అవకాశాలను కల్పించనున్నట్లు వివరించారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికేట్, కుల, ఆదా య, నివాస ధ్రువపత్రాలతోపాటు ఆధార్, రేషన్‌కా ర్డు, నాలుగు పాస్ ఫొటోలు జతచేసి న్యాక్ కార్యాల యం, లేకపోతే జెడ్పీ కార్యాలయంలో ఈనెల 18 లోగా అందజేయాలని సూచించారు. వివరాలకు 9154548063 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు బక్రీద్

- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు


చెన్నూర్‌లో ముస్తాబైన మసీదు

నెన్నెల / ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బక్రీద్‌కు మసీదులు, ఈద్గాలు ముస్తాబు చేశారు. శనివారం పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ తదితర పట్టణాల్లో ఏర్పాట్లు చేశారు. ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 11వ రోజు పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. త్యాగనీరతికి ప్రతీకగా ముస్లింలు పండుగ జరుపుకుంటారు. పండుగ రోజు జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పేదలకు సమభాగాలుగా పంపిణీ చేస్తారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పండుగను త్యాగానికి ప్రతీకగా నెన్నెల మత గురువు షగీర్ అహ్మద్ పేర్కొన్నారు. చెడును నిరోధించడం, మంచిని పెంచడం, కష్టాల్లో సహనం వహిస్తూ త్యాగనీరతిని చూపించాలన్న సందేశమే ఖుర్బానీలో దాగి ఉందని, ప్రతీ ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలని తెలిపారు. పండుగను శాంతియుత వాతావరణంలో కుటుంబ సమేతంగా జరుపుకోవాలని ఉట్నూర్‌లోని జామ మసీద్ మౌలానా కలీం పేర్కొన్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్య


ఆకాశ్ (ఫైల్)

తానూరు: పెళ్లి కావడం లేదని యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రైయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన వాగ్మారే ఆకాశ్ (25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. తల్లి కొద్యబాయికి కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగాలేదు. ఇంట్లో పనులు చేసేవారు లేక వంట చేసుకోవడం ఇబ్బందిగా ఉందని, తల్లి మానసిక పరిస్థితి బాగా లేకపోవడం, తనకు పెళ్లి కావడం లేదని సోదరికి గురువారం రాత్రి ఫోన్‌లో చెప్పాడు. తల్లి బంధువుల ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న ఆకాశ్ మనస్తాపంతో రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటిపక్క వారు చూసి సమాచారమివ్వడంతో ట్రైయినీ ఎస్సై అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సోదరి గాయక్వాడ్ గీతాంజలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైయినీ ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి..

కడెం: జీవితంపై విరక్తితో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపా రు. ఎస్సై, స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిట్యాల్‌కు చెందిన బానవత్ రవి(35) నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి అప్పుల పాలయ్యాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి జీజాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుర్తుతెలియని పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందు తూ మృతిచెందాడు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం ప్రకారం..మండలంలోని ముల్కల్ల గ్రామంలోని వాగొడ్డుపల్లెకు చెందిన పెట్టం మల్లయ్య(68), భార్య మల్లక్క దంపతులు. వారితో ఉన్న పాత గొడవలను మనసులో పెట్టుకుని వాగొడ్డుపల్లెకు చెందిన లగిశెట్టి అమ్మక్క, ఆమె కుటుంబ సభ్యులు గురువారం మల్లయ్య, మల్లక్కపై గురువారం భౌతిక దాడి చేసి దుర్భాషలాడి మానసిక ఇబ్బందులకు గురిచేశారు. పిల్లలు లేని మల్లయ్య చా వక ఎందుకు బతుకుతున్నావని ఊరందరి ముందు తిట్టడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. మల్లయ్య తన ఇంటి వెనుక పశువుల కొట్టంలో మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి అతన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రాత్రి మృతిచెందాడు. భార్య మల్లక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.